# 10 వ్యక్తా వ్యక్తాలు

ఆరాత్రి ఎందుకో కామాక్షికి ఎంత ప్రయత్నించినా పక్కా కుదరలేదు. నిద్రా రాలేదు. కాసేపువుంటేతోలికోడి కూస్తుంది. లేచి పనిచేసుకోవాలి. అమ్మకేమో అనారోగ్యం. పనిలోకి వంగిందంటే చాలు ఒకటే నీరసం. ఐనా ఆమెకేమో తనతో పని చేయించాలని వుండదు. "ఇంత తెల్లారగట్టే ఎందుకు లేచావు అమ్మడూ, పనేదో నేను చూసుకుంటానుగా" అంటుంది. కానీ తనకే మనసొప్పదు. అనారోగ్యంగా వున్న అమ్మ పని చేసుకుంటుంటే, తను హాయిగా పొద్దుపొడిచిందాకా పక్కా కరచుకొవి పడుకుంటే ఏం బాగుంటుంది గనక, కానీ ఆయనకేమో ఆ యింగితంలేదు. నిద్ర పోతున్నట్టే వుంటాడు. పిల్లిలాగా ఎంత మెల్లగా జారుకుందామన్నా వీలు పడదు. యెట్లా పసిగడతాడో ఏమో వులిక్కిపడ్డట్టు లేస్తాడు. ఆయన్ని బ్రతిమాలి బామాలి బయటపడేసరికి బ్రహ్మప్రళయ మవుతుంది. ఏమిటో యీ మగవాళ్ళంతా మరీ విచిత్రం.

కామాక్షి నెమ్మదిగా, సుందరం చేతులు వత్తిగించి పక్కమీద కూర్చున్నది. కిటికీ చువ్వలోంచి పాలవెన్నెల పక్కమీదకు ప్రాకుతోంది. ఆ వెన్నెల్లో సుందరం ముఖం వంక తదేకంగా చూస్తూ కూర్చున్నది. అలా కళ్ళప్పగించి యెంతసేపు చూచినా చూడాలనే అనిపిస్తుంది కామాక్షికి. ఏదన్నా అందం ప్రశక్తి వచ్చిందంటే కామాక్షి కళ్ళల్లో చటుక్కున సుందరం మెదులుతాడు. అందమంటే అలా వుండాలనుకుంటుంది. కానీ, ఆ అందంవల్ల తను పొందుతున్న మనోవ్యధ తలుచుకుంటే, కళ్ళల్లో నీటి పొరలు కమ్ముతాయి. వళ్ళంతా తేళ్ళూ, జెర్రులూ ప్రాకినట్టవుతుంది. తన క్షోభ యితర్లకి అర్థంకాదు. "కామాక్షికేం అదృష్టవంతురాలు. అందమైన భర్త." ఇట్లా అంటారు అంతా. తన బాధ వేరు. తను ఎంతసేపూ తనవల్ల

ఆయన ఏం సుఖపడుతున్నాడు అని ఆలోచిస్తుంది. ఆయన సరసన తను నిలబడేందుకు తనలో యే యోగ్యతలున్నవని పరిశీలించుకుంటుంది.

తను అందంగా వుండదు. అద్దంముందు నిలబడితే తనమీద తనకే అసహ్యం కలుగుతుంది. మరి ఆయన కళ్ళకు ఎట్లా కనిపిస్తోందో తను? యీ తలపు మొదట్లో పురుగులా తొలుస్తుంది. ఏదో భయం వళ్ళంతా జలదరిస్తోంది.

అంతరాంతరాల్లో తనపట్ల ఆయనకు యేం అసంతృప్తి వున్నదో, పైకిమాత్రం ఏం కనిపించనీయడు. పైపెచ్చు "కామాక్షీ నువ్వు మంచిదానివి" అనో వట్టి అమాయకురాలివి అనో, తన్ను ప్రశంసిస్తూనేవుంటాడు. ఇట్లాంటి ప్రశంసలవల్ల తన హృదయం ఏకాస్తకూడా తేలికపడదు. "కామాక్షీ నువ్వు యెంత అందంగా వున్నావ్" అన్న ఒక్క వాక్యం చాలు, తనలో ఆనందం అంచులదాకా పొంగడానికి! కానీ తనలో లేని అందం ఆయన కళ్ళకి మాత్రం యెట్లా గోచరిస్తుంది?

తనను ఆయన అసహ్యించు కోవడంలేదు. అదే పదివేలనిపిస్తుంది. కానీ మనసులో ఎంత అసంతృప్తి వున్నదో నన్న అనుమానం, అనుక్షణమూ పొటమరిస్తూనే వుంటుంది. ఏదో అనిర్వచనీయమైన బాధ కలుగుతుంది. రానురాను జీవితమే ఒక యాతన క్రింద మారుతోంది.

తనకి ఒకోసారి అనిపిస్తుంది. సుందరంలాంటివాడికి కాకుండా తన్ను చదువుసందెలు లేచి ఏ పల్లెటూరివాడికో కట్టబెట్టినా బాగుండేదని.

మొదట అట్లాంటి సంబంధమే ఒకటి వచ్చింది తనకు. పెద్ద యిల్లు, వందెకరాలకుపైగా పొలం, ఇద్దరన్నదమ్ములట. అబ్బాయిమట్టుకు అయితే సుందరంలా అందంగా నాజూగ్గా వుండడు. కాయకష్టం చేసే మనిషి. అయితేనేం, ఆ జబ్బపుష్టి అదీ చూస్తుంటే తనకేమో ముచ్చటేసింది. కళ్ళు వాల్చేసుకొనే ఆ అబ్బాయిని గమనించింది తను. ఆ అబ్బాయి కళ్లు ఎంతో తృప్తితో మెరుస్తున్నాయి. తృప్తితో మెరిసే ఆ కళ్ళని చూస్తుంటే, తనకి మహదానందమైంది. ఈ సంబంధం కుదిరితే బాగుండుననుకున్నది. ఆ రాత్రంతా

ఏవేవోపిచ్చి వూహలు. తెల్లారి నాన్న ఈ సంబంధం ప్రశక్తి తెచ్చి, అమ్మతో అంటున్నాడు. "ఆస్తిపాస్తులు పుష్కలంగానే వున్నాయనుకో! అయినా అక్షరంముక్క రానివాడికి, అమ్మాయిని కట్టబెట్టడం నా కేమాత్రం ఇష్టం" లేదని. నాన్న ఎంత చెబితే అంత అమ్మ. వీళ్ళ వాలకం చూస్తుంటే తనకు ఎక్కడలేని జుగుప్సా కలిగింది. కందకులేని దురద చేమకు అన్నట్టుంది. తన ఇష్టా యిష్టాల ప్రసక్తి వాళ్ళకి అవసరంలేదు. మనసులో వున్నది వ్యక్తంచేసే సాహసం తనకి లేదు.

తర్వాత సుందరం వచ్చాడు. సుందరం పెళ్ళిచూపులకు రాక ముందే, తను సుందరాన్ని గురించి విన్నది. యీ సంబంధంమీద అమ్మకీ నాన్నకీ యెంత మోజో, రోజూ ఇదే ప్రస్తావన ఇంట్లో. అబ్బాయి బాగా చదువుకున్నవాడట. ఎంతో అందంగా వుంటాడుట. అడపా దడపా, మధ్య వర్తుల్లాంటివారు వచ్చేవారు కొంతమంది. వారు మరీ తెగ పొగిడేవారు సుందరాన్ని. వాళ్ళ పొగడ్తలు వింటుంటే అమ్మకీ, నాన్నకి ఎంత సంతోష మయ్యేదో, తనకి అంత దిగులేసేది. గంతకు తగిన బొంత అని, ఎట్లాంటి వాళ్ళకు అట్లాంటివాళ్ళైతే బాగుంటుంది. ఎందునా పొంతనలేని, సుందరానికీ తనకూ ముడిపెట్టడమేమిటి? ఇట్లా ఆలోచించడమేమిటి? ఇట్లా ఆలోచించేది తను. మళ్ళీ వెన్నెల్లో పడుకుంటే సుందరం కళ్ళల్లో మెదులుతాడు. కళ్లు మూసుకొని ఒక కొత్త వూహాలోకాన్ని సృష్టించుకొనేది. ఆ లోకమూ, ఆ వూహలూ యెంతో మధురంగా ఉంటాయి. అక్కడేమో తను చదువు సందెలులేని వట్టిమోటుమనిషి కాదు. సుందరంలాగే చదువుకున్నది. ఎంతో అంత అందంగా ఉంటుంది. తనంటే సుందరానికి పంచప్రాణాలు. తన్ను ఒక్క నిముషం వదలడు. తను ఎంతచెబితే అంత. అసలు ఆయనకేం తెలీదు. వట్టి అమాయకుడు. ప్రతిదీ తను శ్రద్ధ తీసుకోవాలి. భోం చెయ్యడమూ, స్నానం చెయ్యడమూ. బట్టలు మార్చడమూ వగైరాలన్నీ కూడా తను చెప్పి చేయించాలి. పసిపిల్లలు నయం. ఆయనకు తెలిసిందల్లా 'కామాక్షీ! కామాక్షీ!' అంటూ అస్తమానమూ, తన కొంగు పట్టుక తిరగడం విసుగువిరామం లేకుండా తన అందాన్ని పొగడటం.

ఇట్లా యెంతసేపు వూహించుకున్నా వూహించుకో బుద్ధవుతుంది. ఈ వూహల్లోనే ఏ అర్థరాత్రికో నిద్రపట్టేది. నిద్రలో మళ్ళీ అవే కలలు.

రాత్రంతా తేనె టీగల్లా ముసురుకున్న తియ్యటి వూహలు తెల్లారి లేస్తే ఎట్లా పారిపోతాయో పారిపోతాయి. వాస్తవం కళ్ళముందు మెదులు తుంది. సుందరం అంటే భయం. దూరంగా ఉండి ఆరాధించడం బాగానే వుంటుంది కానీ, సుందరం సరసన తను నిలబడ్డం అన్న వూహ గుండెను జలదరింపచేస్తుంది.

తీరా సుందరం పెళ్ళిచూపులకు వచ్చాక తనుపడ్డ బాధ అంతా యింతా కాదు. అమ్మా, నాన్నా ఆరాటం సరేసరి. తను సుందరానికి నచ్చు తానో, నచ్చనేమోనని వాళ్ళ దిగులు! తను నచ్చలేదని సుందరం వెళ్ళితే బాగుండునని తనకనిపించింది. ఏమిటో మళ్ళీ అలంకరించుకోవడంలో అశ్రద్ధ చెయ్యలేదు. వదులు జడవేసి, తలనిండా సన్నజాజులు పెట్టు కున్నది. కళ్ళకు కాటుక రాసుకున్నది. కనకాంబరం చీర కట్టుకొని, వెల్వెట్ జాకెట్ వేసుకుంది. చదువుకున్నవారికి నగలు నచ్చవేమోనని, మెడలో మామిడిపిందెల నెక్లెసూ, వేలికి ఉంగరమూ, చెవులకు రింగులూ తప్ప మరేం పెట్టుకోలేదు. అంతా అయిన తర్వాత మళ్ళీ ఒకసారి అద్దంముందు నిలబడి తన బొమ్మని సుందరం దృష్టితో చూచింది. అంతులేని భయం! సిగ్గుతో చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. పెద్దపులి ముందుకు వచ్చినట్టు వచ్చి సుందరంముందు కూర్చున్నది. సిగ్గుతో వళ్ళంతా కుంచించుకు పోతోంది. అక్కడున్నంతసేపూ ముళ్ళమీదున్నట్టుంది తనకు. లేచివచ్చేప్పుడు, ఎలాగో కళ్ళెత్తి, సుందరాన్ని చూచింది.

తను ఊహించినదానికన్నా కూడా బాగున్నాడు. వెంటనే తన అల్పత్వం జ్ఞాపకానికొచ్చింది.

మనసంతా అదోలా అయిపోయింది. తన అంగీకారం గనక అడిగితే తకీమని సుందరాన్ని పెళ్ళి చేసుకోనని చెప్పాలనుకున్నది. కాని తన అంగీకారం యెవరికి కావాలి? వారికి కావలసిందల్లా సుందరం అంగీకారం.

అసలు సుందరం ఒప్పుకుంటాడని, తనకూ నమ్మకంలేదు. అందు కని నిశ్చింతగానే ఉండిపోయింది. వున్నట్టుండి ఓరోజు ఉదయం సుందరం తండ్రిగారి దగ్గర్నుంచి ఉత్తరం రావటంతోటే, తనమీద పిడుగుపడ్డ ట్టయింది. తన ఊహ పూర్తిగా తప్పిపోయింది—సంబంధం వచ్చిందనీ, వెంటనే వచ్చి ముహూర్తం నిర్ణయించడమే తరువాయి అనీ ఆ ఉత్తరం సారాంశం.

రాతంటే ఇదేకాబోలు అనిపించింది తనకు.మనసులో ఏదో అనిర్వచ నీయమైన ఆందోళన-భయం. తను ఇలా చస్తుంటే,తన తోటివాళ్ళంతా "కామాక్షీ, అదృష్టమంటే, నీదేనే" అన్నారు. అంతా అలా అంటూంటే తనకూ నిజమేనేమోనన్న సందేహం వచ్చింది. తను వూరికే భయపడి పోవాల్సిన అవసరం లేదేమో! తన తోటివాళ్ళకి యెంతోమందికి పెళ్ళి ళ్ళవుతున్నాయి. మొన్ననగా మొన్న మునసబుగా రమ్మాయి సావిత్రికి పెళ్ళయింది. వాళ్ళ నాన్న ఇరవై వేలు కట్నమిచ్చి, పెద్ద యింజనీరు కిచ్చాడు. సుందరంలాగే ఆ అబ్బాయి యెంతో నాజూగ్గా, అందంగా వుంటాడు. మరి సావిత్రేమో, తనకన్నా యెందులోనూ మెరుగనిపించదు. ఐనా సావిత్రి పెళ్ళికి ముందు, తనలాగా యిట్లా బాధపడ్డట్టులేదు. తను చూస్తూనే వున్నది. సావిత్రి సంబరం అంతా యింతా కాదు. ప్రపంచంలోని ఆనందమంతా గుత్తకు తీసుకున్నది కామాలు అనిపించింది.

సావిత్రి జ్ఞాపకానికొచ్చి.తనుమాత్రం యెందుకు అట్లా వుండకూడదు అనిపించింది. తనంతట తాను ఏవో లేనిపోనివి ఊహించుకొని బాధపడు తున్నదేమో? అసలు సుందరానికి, అందం విషయమై అంతగా ఆసక్తి పట్టింపూ లేదేమో! కొంతమంది మగవాళ్ళుంటారు. వాళ్ళకి ఎంతసేపూ అందంకన్నా హృదయం ముఖ్యం? సుందరంకూడా యీ కోవకు చెందిన వాడే. ఎందుకు కాకూడదు అనుకుంది. పుణ్యంకొద్దీ పురుషుడంటారు. తన పుణ్యం మంచిదయితే సుందరం తను ఊహించిన లాటివాడే కావచ్చు. తన లోపాల్నిగూర్చి తను అట్టే బాధపడాల్సిన అవసరం కలగకపోవచ్చు అని అనుకున్నది.

ఇలా అనుకోవడంవల్ల కాస్త మనస్థిమితం దొరికినట్లనిపించింది కామాక్షికి. కానీ పెళ్ళికాగానే మళ్ళీ మొదటి స్థితికి దిగజారవలసి వస్తుందనుకోలేదు. పెళ్ళయిన తర్వాత, సుందరాన్ని యెంతో సునిసితంగా పరిశీలిస్తుంది తను. కానీ, యెంతకూ ఆయన మనస్తత్వం అంతుపట్టదు. ఒకోసారి ఎక్కడో అంతరాంతరాల్లో అసంతృప్తి వున్నట్టే కనపడతారు. మరోసారి అదేం కాదనిపిస్తోంది. ఎంతో లాలనగా మాట్లాడతాడు. ప్రేమగా చూస్తాడు. ఐనా తన బెరుకు తనది. ప్రతిక్షణం తను ఆయనకు తగననే భావం గుండెలమీద గుద్దుతూంటుంది. సరసకు పోవాలన్నా, మనసిచ్చి మాట్లాడాలన్నా విపరీతమైన భయం వేస్తుంది.

తొలికోడి కూసింది. అప్పుడే లేచి అంతా పనులు చేసుకుంటున్నారు కామాక్షి భారంగా లేచి చీర సర్దుకున్నది. పక్కమీదున్న రగ్గుతీసి సుందరం ముఖం వరకు కప్పింది. కప్పుతూ కళ్ళు విప్పార్చి మళ్ళీ ఒకసారి సుందరం ముఖంలోకి చూచింది. ఎందుకో కామాక్షికి కళ్ళల్లో నీళ్ళు మెదిలాయి.

కళ్లు మూసుకొనే "అప్పుడే వెళ్తున్నావా కామాక్షీ?" అన్నాడు సుందరం.

కామాక్షి ఉలిక్కిపడ్డది. "తెల్లగా తెల్లవారింది. అంతా లేచి పనులు చేసుకుంటున్నారండీ" అన్నది మెల్లగా.

సుందరానికి ఏం వినిపించిందో కళ్లు తెరవకుండానే కామాక్షిని పక్కమీదకు లాక్కున్నాడు. కాసేపు కామాక్షి హృదయంలో మల్లెలు విరిసినట్లయింది.

—:o:—